క్లుప్తంగా

దుకాణాలు తొలగించండి



లోలుగులో ఆర్అండ్బీ రోడ్డులో నిర్మించిన దుకాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

పొందూరు: చిలకపాలెం–పొందూరు రహదారిలో వాహనాల రాకపోకలకు, ట్రాఫిక్కు అడ్డుగా ఆర్అండ్బీ రోడ్డులో ఏర్పాటు చేసిన దుకాణాలను తక్షణమే తొలగించాలని ఎస్ఐ వి.సత్యనారాయణ, ఆర్అండ్బీ ఏఈ రాజు దుకాణదారులకు సూచించారు. మండలంలోని లోలుగు, నందివాడ, రాపాక తదితర గ్రామాల సమీపంలో ఆర్అండ్బీ రోడ్డులో నిర్మించిన దుకాణదారులతో మాట్లాడారు. ఈ రోడ్డులో మలుపుల వద్ద ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలు, పొదలను తొలగించారు. ఈ రోడ్డులో వాహనాల రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ ఎక్కువైందని, అందుకే దుకాణాలను తొలగించాలని ఆదేశించారు.

క్వారీల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన వీఆర్వోలు

పొందూరు: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న క్వారీల్లో రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ క్వారీలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ ఆర్.వెంకటేష్ తెలిపారు. బోర్డులను తొలగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాపాక పంచాయతీలోని ఇల్లయ్యగిరిపేట గ్రామ పరిధిలో సర్వే నంబర్ 195, గారపేట సమీపంలో సర్వే నంబర్ 335లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. 335 సర్వే నంబర్లో డీపట్టా భూముల్లో గారపేటకు చెందిన వ్యక్తులు క్వారీ నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. క్వారీ నిర్వాహకులతో మాట్లాడారు. క్వారీ నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని సూచించారు. డీపట్టా భూముల్లో క్వారీ నిర్వహించినట్లు రుజువైతే కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు.

ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్గా అక్కందర సన్యాసిరావు, తొమ్మిది మంది కమిటీ సభ్యులు శనివారం ప్రమాణం స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. దేవాదాయశాఖ అధికారి ప్రసాదరావు, ఈఓ వాసుదేవరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


హెల్మెట్ విధిగా ధరించాలి



మాట్లాడుతున్న సంజీవరావు

నరసన్నపేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, విధిగా హెల్మెట్ ధరించాలని టెక్కలి మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి.సంజీవరావు అన్నారు. నరసన్నపేటలో వాహనదారులకు అవగాహన శనివారం కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు.2.0 జీఎస్టీలో వాహనాల ధరలు తగ్గాయన్నారు. దసరా సమయంలో ద్విచక్ర వాహనాల సేల్స్ జిల్లాలో పెరిగిందన్నారు. స్థానిక జీఎస్టీ అధికారులు, పోలీసులు, వాహనదారులు, టూవీలర్స్ కంపెనీ డీలర్స్ పాల్గొన్నారు.

30 నుంచి మందిర ప్రారంభోత్సవాలు



ప్రారంభోత్సవ పత్రికను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, తదితరులు

హిరమండలం: ఈ నెల 30 నుంచి మూడు రోజులపాటు మండల కేంద్రంలో సత్యసాయి మందిరం ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు తెలిపారు. ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందిరంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఫిజియోథెరపీ సెంటర్, నిత్య నారాయణసేవా కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సత్యసాయి శత వర్ష వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంఘ ప్రతినిధులు నరసింహమూర్తి, నాగేశ్వరరావు, అంధవరపు అబ్బాయి, వెంకట సురేష్, బుచ్చాబ్బాయి, వెంకటరమణ, చంటి మాస్టారు పాల్గొన్నారు.



గడ్డెయ్యపేట జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు

అవస్థలు

- జగనన్న కాలనీల్లో వెలగని విద్యుత్ దీపాలు
- అధ్వానంగా రోడ్లు
- అలంకార ప్రాయంగా కుళాయిలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

నరసన్నపేట నియోజకవర్గంలో జగనన్న కాలనీల వివరాలు

మండలం	నరసన్నపేట	పోలాకి	జలుమూరు	సారవకోట
లేఅవుట్లు	47	25	30	22
పూర్తయిన ఇళ్లు	1,626	235	1,347	1,568

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. దీంతో అక్కడ నివసిస్తున్న కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షం పడితే నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. తాగేందుకు నీరు లేదు. గత ప్రభుత్వంలో వేసిన కుళాయిలు ఇళ్ల ముందు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. విద్యుత్ దీపాలు కూడా సక్రమంగా వెలగడం లేదు. నరసన్నపేటకు చెందిన లబ్ధిదారులకు జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేట లే అవుట్లో వెయ్యి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. 590 మంది ఇళ్లు కట్టుకొని నివసిస్తున్నారు. వర్షాకాలం కావడంతో ఖాళీ స్థలాల్లో జంగిల్ పెరిగి పాములు, విష కీటకాలు తిరుగుతున్నాయి. ఉర్లాంలోని జగనన్న కాలనీలో గల ప్రధాన వీధిలో రహదారి లేక ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలోని జలుమూరు, పోలాకి, సారవకోట మండలాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.



ఉర్లాంలోని జగనన్న కాలనీ రోడ్డు దుస్థితి

సదుపాయాలు కల్పించాలి



జగనన్న దయతో గత ప్రభుత్వంలోనే ఓ ఇంటిని కట్టుకున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలోనే కుళాయిలు వేశారు. ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అలంకార ప్రాయంగానే ఉన్నాయి.

– చల్ల ఎర్రయ్య, జగనన్న కాలనీ, గడ్డెయ్యపేట, నరసన్నపేట

ఇబ్బంది పడుతున్నాం



జగనన్న కాలనీల్లో కనీస సదుపాయాలు లేవు. చాలా ఇబ్బంది పడుతూ జీవిస్తున్నాం. రోడ్లు పరిస్థితి మరీ దారుణంగా ఉన్నాయి. వర్షం పడితే నడవలేక పోతున్నాం. విద్యుత్ లైట్లు లేక పోవడంతో అవస్థలు పడుతున్నాం. ఈ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– సవర రమణమ్మ, గడెయ్యపేట జగనన్న కాలనీ, నరసన్నపేట



గడ్డెయ్యపేటలో అలంకార ప్రాయంగా ఉన్న కుళాయి

సైన్స్తోనే ఉజ్వల భవిష్యత్



నరసన్నపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జలుమూరు: సైన్స్తోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని లింగాలవలస ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.వి రమణ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు సైన్స్పై అవగాహన కల్పించారు. సైన్స్పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు బమ్మిడి శ్రీనివాసరావు, జల్లు రమణమూర్తి, గార విశ్వనాథం, క్యాత్యాయని, దమయంతి, తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: పోస్టర్ను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు

నరసన్నపేటలో..

నరసన్నపేట: మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలు 8, 9, 10వ తరగతి విద్యార్థులు 2,421 మంది హాజరయ్యారని చెకుముకి పరీక్ష మండల కన్వీనర్ సాయి శ్రీనివాస్ తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు టాపర్స్ను ఎంపిక చేసి నవంబర్ 1వ తేదీన మండల స్థాయిలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 249 మంది విద్యార్థులు పరీక్ష రాశారని హెచ్ఎం వెంకటరావు, తదితరులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న సీనియర్ సైంటిస్ట్ సీతారాం

బూర్జ: యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని నైరా వ్యవసాయ కళాశాల సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పి.సీతారాం అన్నారు. మండలంలోని ఏ.పి.పేట పంచాయతీ గోపిదేవిపేట గ్రామంలో శనివారం ఉద్యానవన శాఖ, ఆర్ట్స్ సంస్థ, నాబార్డ్, వనసహజ ఎఫ్పీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ జీడి, మామిడి పంటల వలన మంచి ఆదాయాన్ని సంపాదించవచ్చన్నారు. పెద్దపేట ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ ఆదివాసీ రైతులు జీడి, మామిడి పంటల్లో ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటిస్తే రెట్టింపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న పద్ధతులను ప్రయోగాత్మకంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, ఉద్యానశాఖ అధికారి అయంతి, ఆర్ట్స్ సంస్థ సీఈఓ బి.శంకరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేయాలని వినతి



ఇన్చార్జి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాగభూషణరావు

కొత్తూరు: వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ ఇన్చార్జి ఎంపీడీఓ బసవ రాంబాబుకు కొత్తూరు మండల దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి పడాల నాగభూషణరావు శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలో వందలాది మంది వితంతువులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. పింఛన్లు మంజూరు చేసి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వామ్యం కావాలి

హిరమండలం: కాలుష్యాన్ని నియంత్రించే బాధ్యతను అందరూ తీసుకోవాలని ఎంపీడీఓ కాశీప్రసాదరావు సూచించారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం హిరమండలంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. తహసీల్దార్ జోగారావు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

కొత్తూరు: స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో, కొత్తూరు పంచాయతీలోని చెత్తతో సంపద కేంద్రం వద్ద పిచ్చిమొక్కలను తొలగించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్చార్జి ఎంపీడీఓ బసవ రాంబాబు మొక్కలను నాటారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



సరుబుజ్జిలి–మదనాపురం రహదారిలోని దుర్గగుడి వద్ద ప్రమాదకర మలుపు

- కానరాని ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు
- నిత్యం జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

బూర్జ: పలు ప్రధాన రహదారులు ముళ్ల తుప్పలతో నిండిపోయాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని ఆమదాలవలస–పాలకొండ ప్రధాన రహదారి వైకుంఠపురం నుంచి డొంకలపర్త వరకు విస్తరించి ఉంది. నిత్యం లారీలు, భారీ వాహనాలు, టిప్పర్లు, బస్సులు, ఇసుక, చెరుకు వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటోంది. సరుబుజ్జిలి–మదనాపురం రోడ్డులోనూ అనేక మలుపులున్నాయి. ఈ సింగిల్ రోడ్డులో ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు లేవు.



సరుబుజ్జిలి– మదనాపురం రహదారిలో అన్నంపేట వద్ద ఉన్న మలుపు




వైకుంఠపురం–ఉప్పినివలస మధ్యలో ఉన్న మలుపు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

ఆమదాలవలస–పాలకొండ ప్రధాన రహదారి వైకుంఠపురం నుంచి డొంకలపర్త వరకు సుమారు 30 కిలో మీటర్లలోని మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే హెచ్చరిక బోర్డులతోపాటు, ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి.

– సీర హరిబాబు, బూర్జ గ్రామం, బూర్జ మండలం

భద్రతా చర్యలు చేపట్టాలి



అధికారులు స్పందించి ఆమదాలవలస–పాలకొండ ప్రధాన రహదారి, సరుబుజ్జిలి–మదనాపురం గ్రామాల మధ్యలో ఉన్న సింగిల్ రోడ్డులో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణ చర్యలతోపాటు హెచ్చరిక బోర్డులు కూడా పెట్టాలి.

– భవిరిశెట్టి అప్పన్న, బూర్జ గ్రామం, బూర్జ మండలం

చర్యలు చేపడతాం

ఆమదాలవలస–పాలకొండ ప్రధాన రహదారి, మదనాపురం–సరుబుజ్జిలి సింగిల్ రోడ్డులోని మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. బూర్జ జంక్షన్లో బ్రేక్ కటలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఆర్అండ్బీ, జేఈ, ఆంజనేయ నాయక్

హరిత దీపావళి



పొందూరు మండలంలోని తాడివలస ఉన్నత పాఠశాలలో హరిత దీపావళి పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు హరిత దీపావళిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఆకులు, పూలుతో వివిధ ఆకృతులు చేశారు. అరటి డొప్పలతో దీపాలను తయారు చేశారు. హరిత దీపావళి ఆరోగ్య దీపావళి అని నినాదాలు చేశారు. టపాసులు పేల్చి దీపావళి జరిపితే వాతావరణంలో కాలుష్యం పెరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ హరిత దీపాలను, మట్టి దీపాలను వెలిగించి హరిత దీపావళి చేసుకోవాలని హెచ్ఎం బల్ల కంటయ్య, సైన్స్ ఉపాధ్యాయులు రావాడ పాపారావు, జి.వి.రమణ, విద్యార్థులు కోరారు.

– పొందూరు

అన్నసమారాధన



కొత్తూరు మండలంలోని మహసింగిలో గల వరహాలక్ష్మి నృసింహస్వామి ఆలయంలో ధన త్రయోదశి పురస్కరించుకుని శనివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ‘పసుపరెడ్డి కృష్ణరావు, చంద్రశేఖర్ అందజేసిన విరాళాలతో ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– కొత్తూరు

కల్యాణం.. కమనీయం



ఎల్.ఎన్.పేట మండలం శ్యామలాపురం ఆర్అండ్ఆర్ కాలనీలో రాధాకాంత స్వామి ఆలయంలో నిర్వహించిన శనివారం భగవద్గీత సప్తాహం ముగిసింది. వారం రోజులుగా భగవద్గీత పఠనం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు భగవద్గీత చదివి భక్తులకు వినిపించారు. చివరి రోజు రాధాకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– హిరమండలం

అనుమతి తప్పనిసరి

జలుమూరు/సారవకోట: అనుమతి లేని బాణ సంచా దుకాణాలపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జలుమూరు మండలం పరిధిలోని డీఎంఆర్, విజయ లక్ష్మీ కాకర్స్ దుకాణాలను శనివారం పరిశీలించారు. డీఎంఆర్ షాప్కు ఎటువంటి అనుమతి లేదని, దీనిపై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ జెన్ని రామారావును ఆదేశించారు. విజయలక్ష్మీ ట్రేడర్స్కు సంబంధించి అనుమతి ఉన్నా విద్యుత్శాఖ నుంచి ఎన్ఓసీ తీసుకోలేదని, అపరాధ రుసుం విధించాలన్నారు. అనుమతి లేకుండా బాణ సంచా విక్రయాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. ఆర్డీఓ కృష్ణమూర్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

సారవకోటలో..

సారవకోట: బాణ సంచా విక్రయానికి అనుమతి తప్పనిసరని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సూచించారు. మండలంలోని అడ్డవనస గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేయనున్న బాణ సంచా విక్రయ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ విజయలక్ష్మి ఉన్నారు.

పీఎం సూర్యఘర్పై అవగాహన

- ఏడీ శ్రీధర్కుమార్



మాట్లాడుతున్న డీఈ శ్రీధర్కుమార్

నరసన్నపేట: పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పేనల్స్ అమర్చుకొని సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని నరసన్నపేట ట్రాన్స్కో డీఈ శ్రీధర్కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం గ్రీన్ ఎనర్జీ సోల్యూషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ కొత్త జీఎస్టీలో త్రీ కేవీ యూనిట్కు రూ.10 వేల వరకు యూనిట్ ఖరీదు తగ్గిందన్నారు. గతంలో త్రీ కేవీ యూనిట్కు రూ.2.10 లక్షలు కాగా.. ఇప్పుడు జీఎస్టీ తగ్గిన తరువాత రూ.యూనిట్ ఖరీదు రూ.2 లక్షలకు వస్తోందన్నారు. వినియోగదారులు ముందుకు వస్తే బ్యాంకర్లు కూడా రుణాలు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నారన్నారు. కోటబొమ్మాళి డీఈ జీవీ సురేష్, పోలాకి, ఉర్లాం ఏఈలు శ్రీనివాసరావు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



ఆమదాలవలస: వరలక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు తిమ్మాపురం గ్రామానికి చెందిన సంపతిరావు వరలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు సంపతిరావు రామారావు, సతీష్, కూర్మారావు, తదితరులు ఉన్నారు.

బూర్జలో..

బూర్జ: మండలంలోని అయ్యవారిపేలో ఇటీవల మజ్జి లచ్చుము అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్సీపీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ పరామర్శించారు. పెద్ద లంకాంలో పార్టీ కార్యకర్త దేసుర్ల బలరాం భార్య అనారోగ్యానికి గురికావడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.